క్లుప్తంగా

నేడు పెదవెంకన్నపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

పొన్నలూరు: మండలంలోని పెదవెంకన్నపాలెం గ్రామంలో శుక్రవారం ఉదయం 7 గంటలకు వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల నాయకులు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొనాలని కోరారు.

రేపు సర్వసభ్య సమావేశం

కొండపి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో శనివారం ఎంపీపీ కె.స్వప్నకుమారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎల్‌జబ్రహ్మయ్య తెలిపారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని గురువారం ఓ ప్రకటనలో సూచించారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

వైభవంగా వసంతోత్సవం

పామూరు: మండలంలోని సుబ్బక్కపల్లెలో జరుగుతున్న కోదండరామస్వామి విగ్రహప్రతిష్టలో భాగంగా స్వామి వసంతోత్సవం గురువారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా అర్చకులు సీతా, రామ, లక్ష్మణ, హనుమంతుని మూలవిగ్రహమూర్తులకు, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజల అనంతరం స్వామివార్ల ఉత్సవమూర్తులకు వైభవంగా వసంతోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతాలు చల్లుకుంటూ భక్తులు ఉత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ భక్తులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాల నిర్మూలన అందరి బాధ్యత

కనిగిరి రూరల్: మూఢ నమ్మకాల నిర్మూలన ప్రతి విద్యార్థి బాధ్యతని జేవీవీ నాయకుడు శ్రీనివాసులరెడ్డి అన్నారు. స్థానిక గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జరిగిన ఉచిత వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం ఆయన మాట్లాడారు. అజ్ఞానాన్ని వదిలి విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో విద్యార్థులు క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. ప్రతి ఒక్కరూ సైన్స్‌పై పరిజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. గ్రంథపాలకుడు అహ్మద్ షరీఫ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

104 సేవలను సద్వినియోగం చేసుకోవాలి

సీఎస్‌పురం(పీసీపల్లి): 104 వాహన సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అయ్యలూరివారిపల్లి సర్పంచ్ ముత్యాల భారతీనారాయణరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన విలేజ్ క్లినిక్ వైద్య సేవలలో భాగంగా గురువారం 104 వాహనం ద్వారా డీజీపేట ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది అయ్యలూరివారిపల్లిలో మెడికల్ క్యాంప్ నిర్వహించి రోగులకు వైద్య చికిత్సలు అందజేశారు. వైద్య శిబిరాన్ని సర్పంచ్ భారతీ నారాయణరెడ్డి సందర్శించి వైద్య చికిత్సలను పర్యవేక్షించి రోగులను పరామర్శించారు.

పిడుగుపాటుతో విద్యుత్ సరఫరాకు అంతరాయం


పిడుగుపాటుకు దెబ్బతిన్న ఇన్సులేటర్

కొండపి: ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కొండపి మండలంలో బీభత్సం సృష్టించింది. పెట్లూరు–తాటాకులపాలెం సమీపంలో పిడుగు పడటంతో ఇన్సులేటర్ దెబ్బతిని విద్యుత్ సరఫరా నిలిచి పోయినట్లు ఏఈ కోటయ్య తెలిపారు. పెట్లూరు పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలతో పాటు గుర్రప్పడియ, మూగచింతల, తాటాకులపాలెం, పోలిరెడ్డిపాలెం తదితర గ్రామాల్లో సాయంత్రం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఏఈ ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టారు.

ఈదురు గాలుల బీభత్సం

టంగుటూరు: టంగుటూరులో గురువారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములతో కూడిన వర్షం పడింది. పెనుగాలుల ధాటికి సూరారెడ్డిపాలెం వద్ద చెట్టు రోడ్డుపై పడింది. టోల్ ప్లాజా వద్ద భారీ సూచిక బోర్డు నేలకొరిగింది. అలాగే జమ్ములపాలెం వద్ద ఒక తాటి చెట్టు, ఎస్సీ కాలనీ వద్ద మరో తాటి చెట్టు రోడ్డుకు అడ్డంగా పడటంతో వాహనాల రాకపోకలు గంటపాటు నిలిచాయి. పంచాయతీ సిబ్బంది చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

1726 మంది చుక్కల భూముల రైతులకు లబ్ధి

కొండపి: మండలంలోని వివిధ గ్రామాల్లో చుక్కలు భూములను నిషేధిత జాబితా నుంచి ప్రభుత్వం తొలగించడంతో 1726 మంది రైతులకు లబ్ధి చేకూరిందని తహసీల్దార్ పి.సింగారావు గురువారం తెలిపారు. సంబంధిత రైతులు తమ భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవచ్చని స్పష్టం చేశారు. కొండపి రెవెన్యూ కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు చేతుల మీదుగా చుక్కల భూములకు సీఎం సందేశ పత్రాలను అందజేస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో లబ్ధి పొందిన రైతులు కార్యక్రమానికి హాజరై సీఎం సందేశ పత్రాలు స్వీకరించాలని కోరారు.

నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్
- రూ.25 లక్షలతో పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరాకు శంకుస్థాపన
- రూ.3.20 కోట్లు 15వ ఆర్థిక సంఘ నిధులతో పట్టణ అభివృద్ధి


శంకుస్థాపనలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: పట్టణంలో నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. పట్టణంలోని 11వ వార్డులో పైప్‌లైన్ ద్వార నీటి సరఫరా అందించేందుకు 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.25 లక్షలతో నిర్మించే పైప్‌లైన్ నిర్మాణ పనులకు గురువారం దేవాంగనగర్‌లో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. అనంతరం చైర్మన్ గఫార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో బోర్ల ద్వారా పైప్‌లైన్ వేసి ప్రతి ఇంటికి నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ట్యాంకర్ల రహిత పురపాలక సంఘంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.3.20 కోట్లతో పట్టణంలో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు.

మొదటి విడత నిధులు రూ.1.60 కోట్లలో రూ.52 లక్షలలో బోర్లు పైప్‌లైన్ నిర్మాణాలతో పనులు చేపడుతున్నట్లు వివరించారు. రూ.25లక్షలతో దేవాంగనగర్, టకారీ పాలెంలో రూ. 27లక్షలతో చింతలపాలెం, శంఖవరం గ్రామాల్లో వాటర్ పైప్‌లైన్ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. మిగిలిన సీసీ, రోడ్లు డ్రైన్ల పనులు జరుగుతున్నాయని తెలిపారు. రెండో విడత నిధులు రూ.1.60 లక్షలకు త్వరలో టెండర్లు జరుగుతాయన్నారు. నీటి సమస్య పరిష్కారానికి తొలి ప్రాధానత్యను ఇచ్చి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, వైస్ చైర్మన్ మాణిక్యరావు, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, కౌన్సిలర్లు వేల్పుల వెంకటేశ్వర్లు, దాసరి మురళీ, ఖాశీంసా, రామనబోయిన శ్రీను, అరుణోధర్, దేవరాజ్, రాజేష్, డాక్టర్ రసూల్, అబ్రహం లింకన్, బొట్టు శ్రీను, చింతం శ్రీను, జి.రాములు, స్థానిక నాయకులు కంటు గురవయ్య, ముకరంజీ, కాలేషా, పీర్ హుస్సేన్, అలగోజి మస్తాన్, తిరుపతిరావు, నాగూర్‌బీ, భారతీ, రమేష్, నవకుమార్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ఆగ్రహం



సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీపీ ప్రకాశం

కనిగిరి రూరల్: ఉద్యాన శాఖ అధికారులు అసలు ఎక్కడున్నారు.. మీ శాఖ ఆధ్వర్యంలో ఏ ఏ పథకాలు అమలు అవుతున్నాయో ఏ రైతుకై నా చెప్పారా.. మీరు. మీ ఉన్నతాధికారులు ఎప్పుడైనా రైతులకు అందుబాటులో ఉన్నారా.. అంటూ ఎంపీపీ దంతులూరి ప్రకాశం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం జరిగింది. ఉద్యాన శాఖ మండల స్థాయి అధికారికి బదులు క్షేత్ర స్థాయి అధికారి హాజరయ్యారు. దీంతో ఎంపీపీ మాట్లాడుతూ ఉద్యాన శాఖ అధికారులు రైతులకు కనీస సమాచారం ఇవ్వడం లేదని తీవ్రంగా మండిపడ్డారు. వ్యవసాయ శాఖాధికారులు ఈ క్రాప్ నమోదులో బాధ్యతగా వ్యవహరించడం లేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వం రైతులకు అనేక పథకాలు అమలు చేస్తున్నా ఉద్యాన, వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు లబ్ధి జరగడం లేదని ఆరోపించారు. ఎస్ఆర్ఈ జీఎస్ పథకంలో గ్రామీణ ప్రాంతాల రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్య వైఖరిపై తీవ్రంగా మండిపడ్డారు. ఎన్నిసార్లు చెప్పినా కనిగిరి నుంచి తిరుపతికి బస్సు ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులకు తగు చర్యలకు సిఫార్సు చేయాలని ఎంపీడీఓను ఎంపీపీ ఆదేశించారు. అనంతరం ఎంపీపీ డి.ప్రకాశం మాట్లాడుతూ అధికారులు బాధ్యతగా పనిచేసి ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో సంక్షేమ, అభివృద్ధి పథకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి మాట్లాడుతూ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు.

సమస్యలపై సభ్యుల ధ్వజం

మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు పలు సమస్యలపై ధ్వజమెత్తారు. ఎంపీటీసీ అట్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అటవీ శాఖ నియమ నిబంధనావళిని వివరించాలని అశాఖ అధికారులను ప్రశ్నించగా, అధికారులు సరైన సమాధానం చెప్పక పోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్ ఆర్ ఈజీఆర్ పథకంలో ప్రధాన రోడ్ల వేయాలని కోరారు. సాగర్ నీళ్లు గ్రామాల్లో సక్రమంగా సరఫరా చేయడలం లేదని సర్పంచ్ నాగేంద్రారెడ్డి, కోఆప్షన్ సభ్యులు రహీం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ప్రశ్నించారు. అంగన్ వాడీ భవనాలను త్వరతగతిన పూర్తి చేయాలని, పలువురు సభ్యులు అధికారులను అడిగారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యపై అడిగేందుకు ఆశాఖ అధికారులు హాజరు కాక పోవడం సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశానికి పలు శాఖ అధికారులు గైర్హాజరైన అధికారులపై చర్యలకు కలెక్టర్‌కు సిఫార్సు చేస్తున్నట్లు ఎంపీడీఓ మల్లికార్జునరావు తెలిపారు. మొత్తం 21 శాఖలకు గాను 11 శాఖల అధికారులు మాత్రమే హాజరు కాగా, అందులో మండల స్థాయి అధికారులు తక్కువకాగా, వారి కింద స్థాయి అధికారులు హాజరు కావడంతో సభ్యులకు సరైన సమాధానం చెప్పేవారు లేకుండా పోయారు. దీంతో సభ్యులు తీవ్ర అసహనానికి గురయ్యారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, వైస్ ఎంపీపీ గాలిబోయిన ధనంజయ్, తిరుపతిరెడ్డి, తహసీల్దార్ యు పుల్లారావు, సొసైటీ అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, ఎంపీటీసీ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


బీమా నగదు బ్యాంక్ బుక్‌ను అందచేస్తున్న ఎమ్మెల్యే

కనిగిరి రూరల్: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నట్లు ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. పట్టణంలోని దేవాంగనగర్‌లో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వట్టివేళ్ల శ్రీరంగం కుటుంబసభ్యుల అకౌంట్‌కు బీమా నగదు రూ.5లక్షలు జమ చేసిన బ్యాంక్ బుక్‌ను ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ చేతుల మీదుగా గురువారం అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ వైఎస్సార్ బీమా పథకం పేద వర్గాలకు ఎంతగానో దోహద పడుతుందన్నారు. ప్రభుత్వం పేద వర్గాల అభ్యున్నతికి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, వైస్ చైర్మన్ మాణిక్యరావు, ఖాశిం సాహెబ్, అబ్రహం లింకన్, ముకరంజీ, అలగోజీ మస్తాన్, కాలేషా, పీర్ హుస్సేన్, గర్రె రామారావు, కంటు గురవయ్య, కౌన్సిలర్లు దేవరాజ్, వేల్పుల వెంకటేశ్వర్లు, దాసరి మురళీ, రామనబోయిన శ్రీను, అరుణోధర్, రాజేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి పోలేరమ్మ తల్లి వార్షిక వేడుకలు

సీఎస్‌పురం(పీసీపల్లి) : మండలంలోని అయ్యలూరివారిపల్లిలో శుక్రవారం నుంచి గ్రామ దేవత పోలేరమ్మ తల్లి వార్షిక వేడుకలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. 26 శుక్రవారం ఉదయం దీపారాధన, గణపతి పూజ, పుణ్యాహ వాచనం, లక్ష్మీ గణపతి హోమం, కుంకుమార్చన, 27 న అమ్మవారికి 101 కలశాలతో అభిషేకం, చండీ హోమం, 28 పూర్ణాహుతి, పొంగళ్ల పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఈ ఏడాది ఉపాధి లక్ష్యం చేరుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ సుకుమార్

వెలిగండ్ల: ఉపాధి హామీ సిబ్బంది తమకు ఇచ్చిన లక్ష్యాన్ని చేరుకోవాలని ఎంపీడీఓ టి.సుకుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ టి.సుకుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో ఎక్కువ మంది కూలీలు హాజరయ్యేలా కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. కొలతల ప్రకారం కూలి పడేలా చూడాలన్నారు. సర్పంచ్ టి.సురేష్‌కుమార్, టీఏలు మనోహర్, ఆదినారాయణ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి


పొంగళ్లతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

కొండపి: మండలంలోని కొండపి పంచాయతీ కట్టావారిపాలెం గ్రామంలో పోలేరమ్మతల్లి దేవస్థానం 10వ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. గ్రామ మహిళలు పొంగళ్లతో ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమాలను దేవస్థానం కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

వైఎస్సార్ బీమా పేదలకు వరం

కనిగిరి రూరల్: వైఎస్సార్ బీమా పథకం పేదలకు వరం లాంటిదని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పదో వార్డులోని అర్బన్ కాలనీలో అనారోగ్యంతో మృతి చెందిన పి.శివ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పథకం కింద మట్టి ఖర్చులకు రూ.10 వేల నగదును గురువారం చైర్మన్ గఫార్, కౌన్సిలర్ దాసరి మురళీలు అందచేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు ఎంతో అండగా నిలుస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దాసరి మురళీ, స్నేహ హస్తం సొసైటీ అధ్యక్షుడు డి.సుధీర్‌బాబు, డాక్టర్ రసూల్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కొండపిలో 751 బేళ్లు కొనుగోలు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి అనకర్లపూడి, పెరిదేపి, మిట్టపాలెం, ముప్పరాజుపాలెం గ్రామాల రైతులు గురువారం 802 బేళ్లు తీసుకురాగా 751 కొనుగోలయ్యాయి. 49 బేళ్లను వివిధ కారణాలతో వ్యాపారులు తిరస్కరించారు. అత్యధిక ధర కేజీ రూ.200, అత్యల్ప ధర రూ.153, సరాసరి ధర రూ.198.28 పలికిందని వేలం నిర్వహణాధికారి ఎస్.రామారావు తెలిపారు.

27, 28న వాలీబాల్ ఓపెన్ టోర్నమెంట్

టంగుటూరు: టంగుటూరు పురం సెంటర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లా స్థాయిలో ఈ నెల 27, 28వ తేదీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వాలీబాల్ ఓపెన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సభ్యులు తులిబిల్లి అశోక్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.15 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు, మూడో బహుమతి రూ.7 వేలు, నాలుగో బహుమతి రూ.5 వేలు అందిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 8919591417, 9951170382ను సంప్రదించాలని సూచించారు.

పొగమంచు..ఉక్కపోత..చిరుజల్లులు

- భిన్న వాతావరణంలో ప్రజల ఇక్కట్లు


జాతీయ రహదారి 565 మీద పొగమంచులో

పామూరు: ఒకే రోజు భిన్న రకాల్లో వాతావరణం ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉదయం కొన్ని ప్రాంతాల్లో పొగమంచు పడుతుండటంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతుండగా మధ్యాహ్నం సమయంలో భానుడి భగభగలు, తీవ్ర ఉక్కపోత ఉంటోంది. సాయంత్రం సమయానికి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది.


మధ్యాహ్నం ఎండ దెబ్బకు జనసంచారం లేని నెల్లూరురోడ్డు


సాయంత్రం సమయంలో కారుమబ్బులు


విప్పగుంటలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న అశోక్‌బాబు

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

- వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు
- విప్పగుంటలో గడప గడపకు మన ప్రభుత్వం

పొన్నలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని కొండపి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. మండలంలోని విప్పగుంట గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటిని సదర్శించి నాలుగేళ్లగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. నవరత్న పథకాలు ద్వారా గ్రామాల్లోని నిరుపేద కుటుంబాలు లబ్ధిపొందడంతో వారి జీవన స్థితిగతులు మెరుగుపడ్డాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లను ఆయా పంచాయతీల్లో ప్రజలకు అందుబాటులో నిర్మించి కనీస మౌలిక వసతులను ప్రభుత్వం సమకూర్చిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం అబద్ధపు హామీలను ఇచ్చి రైతులను, మహిళలతో పాటు అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో కనిపిస్తున్నాయన్నారు. జగనన్న కాలనీల ద్వారా ప్రజలకు సొంతింటి కలను నిజం చేస్తూ ఒకే చోట వందల కొద్ది గృహాలను నిర్మిస్తూ సరికొత్త గ్రామాలను రాష్ట్ర ప్రభుత్వం సృష్టిస్తోందన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి, మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ చొప్పర జ్యోతి, ముప్పా కోటేశ్వరరావు, దావులూరి మాల్యాద్రి, ఇడవలపాటి మాధవ, ముప్పా నరసింగరావు, చొప్పర మహేంద్ర, డీలర్ బండారు మాధవ, వరపర్ల రవణయ్య, అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి


మాట్లాడుతున్న ఎంపీపీ అత్యాల జఫన్య

పీసీపల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని ఎంపీపీ అత్యాల జఫన్య అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశహాలులో గురువారం ఎంపీపీ జఫన్య అధ్యక్షత మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలుశాఖల అధికారులు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. వ్యవసాయాధికారి వెంకటస్వామి మాట్లాడుతూ వచ్చే సాగు సీజన్‌కు రాయితీపై వివిధ పరికరాలను అందజేసేందుకు రైతులు ఆర్బీకేల్లో దరఖాస్తుచేసుకోవాలని సూచించారు. డాక్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ వేసవి ఎండతీవ్రత అధికంగా ఉంటుందని ఉదయం, సాయంత్ర సమయాల్లో పనులుచేసుకుని ఎండతీవ్రతకు దూరంగా ఉండాలని తెలిపి వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏపీవో సుబ్బారావు మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా పనులు అడిగిన ప్రతి జాబ్‌కార్డు ఉన్నవారికి పనులు కల్పిస్తున్నామన్నారు. ఏపీఎం ఇందిర, పశువైద్యాధికారి డాక్టర్ పేరయ్య, ఎంఈఓ దాసు ప్రసాద్, ఏఈ లక్ష్మీ ప్రసన్నకుమార్ మాట్లాడారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాలని ఎంపీడీఓకు ఎంపీపీ సూచించారు. వైస్ ఎంపీపీ బండారు రామక్రిష్ణ, తహసీల్దార్ బీఆర్ ఎల్‌వీ ప్రసాద్, ఎంపీడీఓ రమణారెడ్డి, ఈఓఆర్డీ మల్లీశ్వరి, ఎంపీటీసీలు చెరుకూరి సతీష్, కొండారెడ్డి, మూలె సీత, యం.రమణమ్మ, కోఆప్షన్ కరీంబాషా, మురుగమ్మి సర్పంచ్ నలగంగుల శ్రీను, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణకు కృషి చేయాలి

- కందుకూరు జూనియర్ సివిల్ జడ్జి పూర్ణిమ


పొన్నలూరు : బాలల చట్టాలపై మాట్లాడుతున్న న్యాయమూర్తి పూర్ణిమ

పొన్నలూరు: బాలల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కందుకూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి పూర్ణిమ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ బాలల మిస్సింగ్ డే సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేసి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి పూర్ణిమ మాట్లాడుతూ.. బాలలు అమాయకత్వం వల్ల చిన్న వయసులో తప్పిపోతుంటారని, బయటకు వెళ్లినప్పుడు తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రుల కోరికల ప్రభావం పిల్లలపై పడటం వల్ల మానసిక ఆందోళనకు గురై ఇంటి నుంచి పారిపోతారన్నారు. స్వేచ్ఛాయుత వాతవరణంలో బాలలను ఎదగనిచ్చి, వాళ్ల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఆడపిల్లలకు బాల్య వివాహాలు చేసి వారి జీవితాలను నాశనం చేయవద్దని తల్లిదండ్రులకు హితవుపలికారు. ముఖ్యంగా బాలల చట్టలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తహసీల్దార్ శైలేంద్రకుమార్, ఎంపీడీఓ రత్నజ్యోతి, సీడీపీఓ మాధవిలత, సూపర్‌వైజర్ రమాదేవి, ఎంఈఓ రవిచంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ గాయం సావిత్రి

హనుమంతునిపాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా ఏర్పాటు చేసిన ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు, 104 వైద్య సేవలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీపీ గాయం సావిత్రి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓ అధ్యక్షతన గురువారం సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు, ఏఎన్ఎంలకు, ఎంఎల్‌పీహెచ్‌లకు, అంగన్‌వాడీ, కార్యకర్తలకు, ఆశావర్కర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలందరికీ మెరుగైన వైద్య సేవలందించాలని ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో వైద్య సిబ్బందిని కొరత లేకుండా ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి వైద్య సేవలు అందిస్తున్నారు. ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, డాక్టర్ ఎం ప్రతాప్‌రెడ్డి, మండల సర్పంచ్ సంఘ అధ్యక్షుడు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎం పార్వతి, షేక్ గౌస్‌పీషాబేగం, సీహెచ్‌ఓ కేవీ చెన్నయ్య, సర్పంచ్ కత్తి రాజారావు, రామక్రిష్ణ, భవనం క్రిష్టారెడ్డి, ఎంపీటీసీలు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.